GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 71 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 14 అక్టోబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

ఏపీలో వర్షాలు.. మెసేజ్లతో ప్రజలను అలర్ట్ చేయాలి: చంద్రబాబు

4 రోజులు వర్షాలుంటాయని వాతావరణ శాఖ తెలిపిందని సీఎం చంద్రబాబు చెప్పారు.

అమరావతి, అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలుంటాయని వాతావరణ శాఖ తెలిపిందని సీఎంచంద్రబాబు చెప్పారు. చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలపై కలెక్టర్లు, మంత్రులు, అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రభుత్వ విభాగాల సన్నద్ధతపై సమీక్షించారు. వర్షాలపై ప్రజల మొబైల్ ఫోన్లకు మెసేజ్ లు పంపి అలర్ట్ చేయాలన్నారు. చెరువు కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టిపెట్టాలని చెప్పారు. వాగులు, కాలువల వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులు పెట్టాలని ఆదేశించారు. అప్రమత్తతతో ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చేయాలని చెప్పారు. కంట్రోల్ రూమ్లు ఏర్పాటుచేసి ప్రజల వినతులపై వేగంగా స్పందించాలని చంద్రబాబు తెలిపారు.ప్రకాశం, నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని చెప్పారు.

త్వరలో దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తాం: మంత్రి సీతక్క

దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మంత్రి సీతక్క తెలిపారు.

హైదరాబాద్, అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మంత్రి సీతక్క తెలిపారు. దివ్యాంగుల జాబ్ పోర్టల్ను ఆమె ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖలో 10 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు జాబ్ పోర్టల్లో రిజిస్టర్ చేసుకుంటే అర్హత ప్రకారం ఉద్యోగాలు వస్తాయన్నారు. సంక్షేమ నిధుల్లో వారికి ఐదు శాతం కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రైవేటు ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలల్లోనూ రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. దివ్యాంగుల పరికరాల కోసం బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని సీతక్క వివరించారు. త్వరలో వారికి సంబంధించిన బడ్జెట్లో రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసు.. లొంగిపోయిన ప్రధాన నిందితుడు

తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడు పానుగంటి చైతన్య మంగళగిరి కోర్టులో లొంగిపోయాడు.

అమరావతి, అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్) తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడు పానుగంటి చైతన్య మంగళగిరి కోర్టులో లొంగిపోయాడు. ఆయన వైకాపా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నాడు. గతంలో తెదేపా కార్యాలయంపై దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. కూటమి ప్రభుత్వం రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చైతన్య.. వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ప్రధాన అనుచరుడు.వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. వైకాపా నేతలు దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులు దాడి చేశారు. మరోవైపు ఈ కేసును వేగంగా విచారించేందుకు ఇటీవల సీఐడీకి అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కొన్ని సాంకేతిక కారణాలతో అప్పగించడంలో ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో మంగళగిరి పోలీసులు విచారణను కొనసాగిస్తున్నారు.

సొంతూరిలో సీఎం దసరా వేడుకలు

నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి శనివారం దసరా వేడుకలు జరుపుకొన్నారు..

వంగూరు,కొడంగల్,అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): నాగర్కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి శనివారం దసరా వేడుకలు జరుపుకొన్నారు. సీఎం హోదాలో తొలిసారి గ్రామానికి రావడంతో గ్రామస్థులు భారీ ఏర్పాట్లు చేశారు. హెలికాప్టర్లో మధ్యాహ్నం 2.47 గంటలకు చేరుకున్న ఆయనకు నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్కర్నూల్, మక్తల్ ఎమ్మెల్యేలు డా. వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్రెడ్డి, శ్రీహరి, విద్యుత్తు శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, గ్రామస్థులు స్వాగతం పలికారు. మహిళలు, యువకులు బతుకమ్మలు, కోలాటాలతో ఊరేగింపు చేపట్టారు. సీఎం దారి పొడవునా అందరినీ పలకరిస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.3 కోట్ల సొంత నిధులతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. నవంబరు 20లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరవుతానని నిర్వాహకులకు చెప్పారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద మనవడితో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కొండారెడ్డిపల్లిలో సీఎం తన తండ్రి నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం రూ.72 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ముందుగా ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక పశు వైద్యశాల, బీసీ సముదాయ భవనం, అమరజవాన్ యాదయ్య స్మారకార్థం నిర్మించిన గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రూ.18 కోట్లతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులు, రూ.64 లక్షలతో ప్రయాణ ప్రాంగణం, రూ.15 కోట్లతో నాలుగు వరుసల రోడ్డు, మధ్యలో విద్యుద్దీపాలంకరణ, రూ.32 లక్షలతో చిన్నపిల్లల పార్కు, రూ.20 కోట్లతో ఎల్లికల్, జంగారెడ్డిపల్లి మీదుగా కొండారెడ్డిపల్లి, తుమ్మలపల్లి, వంగూరు, సర్వారెడ్డిపల్లి హైవే రోడ్డు వరకు రెండు వరుసల రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, సీఎం సోదరుడు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎం రాక నేపథ్యంలో గ్రామంలో 30 మంది సీఐలు, 40 మంది ఎస్సైలతోపాటు 750 మంది ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.దసరా మరుసటిరోజు వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలను కలిసి మాట్లాడటం సీఎం రేవంత్రెడ్డి సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రే కొడంగల్ పట్టణంలోని తన ఇంటికి చేరుకున్న ఆయన ఆదివారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు కార్యకర్తలు, అధికారులు, తన అభిమానులను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొడంగల్ నుంచి హెలికాప్టర్లో హైదరాబాద్కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గురునాథెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

బలమైన నాయకత్వంతో ఏపీకి మంచి రోజులు: డిప్యూటీ సీఎం పవన్

ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండగ' వారోత్సవాలను డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ ప్రారంభించారు.

కంకిపాడు, అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండగ' వారోత్సవాలను డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ ప్రారంభించారు. కృష్ణా జిల్లా కంకిపాడులో దీనికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా పవన్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.95.15 లక్షలతో రోడ్లు, మినీ గోకులాలు, పునాదిపాడులో రూ.52 లక్షలతో 2 అంతర్గత రహదారులు, రూ.54 లక్షలతో సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు."మా ఆకాంక్ష అంతా ఒక్కటే. రాష్ట్రంలోని ప్రజలంతా బాగుండాలి. యువతకు ఉపాధి అవకాశాలు రావాలి.. పల్లెల్లో వెలుగులు నిండాలి. ఇవన్నీ జరగాలంటే వైకాపా ప్రభుత్వం దిగిపోవాలని గట్టిగా కృషి చేశాం. బలమైన నాయకత్వం వల్ల రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయి. సంకల్పంతో ముందుకెళ్లాం.. అనుకున్న విజయాన్ని సాధించాం. రాష్ట్ర శ్రేయస్సు కోసం బలంగా ఉన్నప్పుడే అనుకున్నది సాధ్యమవుతుంది. ఒకేరోజు 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాం. దేశంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఇప్పటికే పంచాయతీ తీర్మానాలు చేసిన పనులకు పరిపాలన, సాంకేతిక ఆమోదం ఇచ్చాం. రూ.4,500 కోట్ల నిధులు విడుదల చేస్తున్నాం. పంచాయతీల్లో పనులపై డిస్నే బోర్డులు ఉండాలి. దాపరికం లేకుండా అన్ని వివరాలు అందులో కనిపించాలి. మేం ఎంత పారదర్శకంగా ఉన్నా.. వ్యవస్థలో వ్యక్తులు కూడా బలంగా ఉండాలి"అని పవన్ అన్నారు.నాలుగోదఫా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాకు స్ఫూర్తి. ఆయన అపారమైన అనుభవం రాష్ట్రానికి బలం. నాయకుడి కష్టం, అనుభవం రాష్ట్ర శ్రేయస్సుకు ఉపయోగించుకోకపోతే తప్పు చేసినవాళ్లం అవుతాం. అందుకే ఆరోజు కలిసి వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నా. అప్పుడు తీసుకున్న నిర్ణయం సరైనదేనని అనిపిస్తోంది. తెదేపా, భాజపా, జనసేన బలంగా నిలబడటం వల్లే ఇది సాధ్యమైంది. ప్రధాని మోదీ ఆశీస్సులు, భాజపా నేతల బలం కూటమి ప్రభుత్వానికి మేలు చేకూర్చుతాయి. క్యాబినెట్ సహా అధికారులతో జరిగే సమావేశాల్లో చూస్తుంటా. వివిధ అంశాలపై చంద్రబాబు చాలా బలంగా మాట్లాడుతుంటారు. శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండలనేదానిపై దిశానిర్దేశం చేస్తుంటారు. కొన్ని అభివృద్ధి పనులు చేసేటప్పుడు పంచాయతీరాజ్ శాఖ చాలా శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. కాకినాడలో ఓ ఐఎఫ్ఎస్ అధికారి మా పేరు చెప్పి డబ్బులు అడుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే సస్పెండ్ చేయాలని ఆదేశించాను. ఈ ప్రభుత్వంలో అలాంటి వ్యక్తుల ప్రమేయం ఉండొద్దని స్పష్టంగా చెప్పాను. లంచాల ప్రభుత్వం కాదిది.. నిలబడే ప్రభుత్వం" అని ఆయన వ్యాఖ్యానించారు.గుడివాడ నియోజకవర్గంలో 43 గ్రామాల్లో నీటి సమస్యను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన దృష్టికి తీసుకొచ్చారని పవన్ తెలిపారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు బూతులు, శాపనార్థాలు తప్ప ఈ నీటి సమస్య గురించి పట్టించుకోలేదని మండిపడ్డారు. వెంటనే గ్రామీణ నీటి సరఫరా అధికారులు ప్రతీ గ్రామానికి బృందాలను పంపి నీటి నాణ్యత పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సంవత్సరానికి రూ.10 వేల కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రానికి నిధులు వస్తాయని, దీనిద్వారా నైపుణ్యం లేని వ్యక్తులకు ఉపాధి అందించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్నవారికి 15 రోజుల్లో పని కల్పించడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. 15 రోజుల్లోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతిని అందించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనన్నారు. దానికి అనుగుణంగా ప్రతీఒక్కరికీ ఉపాధి కల్పించేలా పని చేస్తున్నట్లు తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

తొలేళ్ల సంబరాలు.. పైడితల్లి అమ్మవారికి

పట్టువస్త్రాలు సమర్పించిన అశోక్ గజపతిరాజు

పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరాలు విజయనగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.

విజయనగరం, అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరాలు విజయనగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా కేంద్ర మాజీ మంత్రి, ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు వారందరికీ అలయ అధికారులు, అర్చకులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు అశోక్ గజపతిరాజు చెప్పారు

అమ్మవారి విగ్రహం ధ్వంసం.. మోండామార్కెట్

ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత

మోండా మార్కెట్ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.



సికింద్రాబాద్, మోండా మార్కెట్ సమీపంలోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలియడంతో ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో స్థానికులు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు . పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్రెడ్డి కేంద్రమంత్రి కిషన్రెడ్డి ఆలయం వద్దకు చేరుకున్నారు. సీపీ సీవీ ఆనంద్ కలిసి గుడి లోపలికి వెళ్లి పరిశీలించారు. పోలీసు ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఘటనాస్థలికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ఒకర్ని అరెస్టు చేశారు

కందిరీగల దాడిలో చిన్నారి మృతి

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ వై.కంతవరంలో ఆదివారం కందిరీగలు దాడి చేయడంతో నాలుగేళ్ల చిన్నారి వంతాల గౌరి మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి.



ముంచంగిపుట్టు,అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ వై. కంతవరంలో ఆదివారం కందిరీగలు దాడి చేయడంతో నాలుగేళ్ల చిన్నారి వంతాల గౌరి మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు అందించిన వివరాల ప్రకారం.. వై. కంతవరంలో నివాసం ఉంటున్న బొజ్జయ్య, టికోలకు గౌరీ, విశ్వ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. గౌరీ, విశ్వ ఆడుకునేందుకు గ్రామ సమీపంలోని కొండపైకి వెళ్లారు. అక్కడ కందిరీగలు దాడిచేసి వారిద్దరిని తీవ్రంగా గాయపర్చాయి.. పిల్లల కేకలు విని కొండపైకి వెళ్లిన, వారి బంధువు రాజేష్ కూడా కందిరీగల దాడిలో గాయపడ్డారు. దీనిపై తల్లిదండ్రులు, గ్రామస్థులు రూధకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్సు డ్రైవర్కు సమాచారమిచ్చారు. అంబులెన్సులో ఇంధనం లేదని, పాడేరు వెళ్లి నింపుకొని రావాలని చెప్పడంతో, గ్రామస్థులు ప్రైవేటు ఆటోలో రూధకోట పీహెచ్సీకి తరలించారు. గౌరి పరిస్థితి విషమంగా ఉండటంతో ముంచంగిపుట్టు సీహెచ్సీకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఆటోలో ఆ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక మృతి చెందింది.

మద్యం మత్తులో గొడవ.. యువకుడి దారుణ హత్య

మద్యం మత్తులో గొడవ పడిన కొందరు యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన జగద్గిరిగుట్ట ఠాణాపరిధిలో జరిగింది. సీఐ నర్సింహ వివరాల ప్రకారం..

షాపూర్నగర్: మద్యం మత్తులో గొడవ పడిన కొందరు యువకుడిని దారుణంగా హత్య చేసినసంఘటన జగద్గిరిగుట్ట ఠాణాపరిధిలో జరిగింది. సీఐ నర్సింహ వివరాల ప్రకారం.. అక్బర్షాషా,షాహిన్బేగం దంపతులు జగద్గిరిగుట్ట పరిధి ధీనబంధు కాలనీలో ఉంటున్నారు. వారి కుమారుడునదీమ్(21). అక్బర్షాషా మసీదులో పనిచేస్తుండగా.. నదీమ్ బ్యాండ్మేళంలో పనిచేస్తున్నాడు.త%%రచూ స్నేహితులతో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి జన్మదిన వేడుకలకువెళ్లాడు. స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. రోడ్డుపై వారు గొడవ పడడంతో పోలీసులు వచ్చివారికి సర్దిచెప్పి ఇంటికి పంపించారు. అనంతరం కొంతమంది నదీమ్ ఇంటికి వెళ్లి బయటకుపిలిచి గొడవపడ్డారు. ఘర్షణ పెద్దది కావడంతో మద్యం మత్తులో వారు ఇనుపరాడ్తో నదీమ్తలపై విచక్షణారహితంగా కొట్టడంతో కుప్పకూలాడు. రక్తపుమడుగులో ఉన్న అతన్ని పోలీసులుగాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు అనుమానితుడు ఖలీల్ తోపాటుమిగతా వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు

అల్పపీడనం ఎఫెక్ట్.. ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విశాఖ జిల్లాలో తెల్లవారుజాము నుంచి వర్షం పడుతోంది. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరుమలలో కురుస్తున్న భారీ వర్షంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.నెల్లూరు జిల్లాలోని ఇందుకూరిపేట, కోవూరు, కొడవలూరు మండలాల్లో ఎడతెరిపిలేకుండా భారీగా కురుస్తోంది. నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే 0861-2331261, 7995576699, 1077 నంబర్లకు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని.. రెవెన్యూ, నీటిపారుదల అధికారులు పెన్నా నది గట్లు పరిశీలించాలని ఆదేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు నేడు సెలవు ప్రకటించారు.ప్రకాశం జిల్లా ఒంగోలు, మద్దిపాడు, గిద్దలూరు, కొమరోలులో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షంతో ఒంగోలులోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, మార్టూరు, ఇంకొల్లు, కొల్లూరు, వేమూరు, అద్దంకి, యద్దనపూడి, జె. పంగులూరు, బల్లికురవ, నిజాంపట్నం, కర్తపాలెంలో వర్షం కురుస్తోంది. కృష్ణా జిల్లా మచిలీపట్నం, ఉయ్యూరు, అవనిగడ్డలో ఈదరుగాలులతో వర్షం పడుతోంది. విశాఖపట్నంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. అన్నమయ్య జిల్లాలోనూ వర్షం కురుస్తోంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ సెలవు ప్రకటించారు

మచిలీపట్నంలో ఇతర రాష్ట్రాల వారికి దక్కిన రెండు మద్యం దుకాణాలు

ఏపీలో మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ కొనసాగుతోంది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రెండు వైన్షాపులను ఇతర రాష్ట్రాలకు చెందిన వారు దక్కించుకున్నారు.

మచిలీపట్నం,అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ కొనసాగుతోంది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రెండు వైనొప్పులను ఇతర రాష్ట్రాలకు చెందిన వారు దక్కించుకున్నారు. పట్టణంలోని 1వ నంబర్ దుకాణం కర్ణాటకకు చెందిన మహేశ్ ఎ బాతే, 2వ నంబర్ షాపు యూపీ వాసి లోకేశ్ చండ్కు దక్కాయి. లాటరీలో వారి పేర్లు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. మిగిలిన దుకాణాలకు జిల్లా అధికారులు లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో దీన్ని ర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే నేరుగా జిల్లా కలెక్టర్కి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. లాటరీ సమయంలో దరఖాస్తుదారు హాజరు తప్పనిసరి కాదన్నారు. దరఖాస్తుదారు లేనప్పటికీ వారికి లాటరీ తగిలితే అధికారులు సమాచారం అందజేస్తారని తెలిపారు.

తెదేపా కార్యాలయంపై దాడి కేసు.. విచారణకు హాజరైన వైకాపా నేతలు

తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు తలశిల రఘురాం, దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి పోలీసు విచారణకు హాజరయ్యారు.

అమరావతి, అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, దేవినేని అవినాష్ పోలీసుల విచారణకు హాజరయ్యారు. మంగళగిరి గ్రామీణ పోలీసు స్టేషన్లో ఈ ముగ్గురు వైకాపా నేతలను విచారిస్తున్నారు. దాడి రోజు ఉదయం వీరంతా ఎక్కడెక్కడ కలిశారు.. ఏయే ప్రాంతాల్లో సమావేశమయ్యారు? తదితర వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.మరోవైపు ఈ కేసును వేగంగా విచారించేందుకు ఇటీవల సీఐడీకి అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కొన్ని సాంకేతిక కారణాలతో అప్పగించడంలో ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో మంగళగిరి పోలీసులు విచారణను కొనసాగిస్తున్నారు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. వైకాపా నేతలు దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులు దాడి చేశారు.

మూడు, నాలుగేళ్లలో 300 గనుల మూసివేత: కిషన్రెడ్డి

పర్యావరణంతో పాటు ప్రకృతికి విఘాతం కలిగిస్తున్న.. దేశవ్యాప్తంగా ఉన్న 300 బొగ్గు గనులను రానున్న మూడు, నాలుగేళ్లలో మూసివేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి. కిషన్రెడ్డి తెలిపారు.

బండ్లగూడ, అక్టోబర్ 14(రిపబ్లిక్న్యూస్): పర్యావరణంతో పాటు ప్రకృతికి విఘాతం కలిగిస్తున్న.. దేశవ్యాప్తంగాఉన్న 300 బొగ్గు గనులను రానున్న మూడు, నాలుగేళ్లలో మూసివేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్రెడ్డి తెలిపారు. బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) శిక్షణ సంస్థలో పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం సాంప్రదాయేతర విద్యుత్తు ఉత్పత్తి 2.18 గిగావాట్లుగా ఉందని, 2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్యంగా కేంద్రం పనిచేస్తుందన్నారు. పునరుత్పాదక రంగానికి భవిష్యత్తులో రూ.50 వేల కోట్ల కేటాయింపులు ఉంటాయన్నారు. మూసివేసే బొగ్గుగనుల ప్రాంతాల్లో మొక్కలు పెంచేందుకు, రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించామన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. జీఎస్ఐ శిక్షణ సంస్థలో 150 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్తు ప్లాంట్ను ఏర్పాటు చేశామని, తద్వారా ఏటా సంస్థకు రూ.30 లక్షలు ఆదా అవుతాయని సంస్థ డైరెక్టర్ జనరల్ డా.మాథ్యూ జోసఫ్ తెలిపారు. అంతకుముందు సంస్థ ఆవరణలో కేంద్రమంత్రి మొక్కలు నాటారు. జీఎస్ఐఐ సంస్థ ఏడీజీ ఎస్.డి. పట్నాజీ, పీఆర్వో గంజి మల్లేశ్, కార్పొరేటర్లు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, భాజపా రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పండగకొచ్చారు... పట్నం బాట పట్టారు

దసరా పండగకు పల్లెలకు వచ్చిన ప్రజలు ఆదివారం నుంచే పట్నం బాట పట్టారు.

అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): దసరా పండగకు పల్లెలకు వచ్చిన ప్రజలు ఆదివారం నుంచే పట్నం బాట పట్టారు. వరంగల్- హైదరాబాద్ రహదారిపై బీబీనగర్ టోల్ ప్లాజా వద్ద, విజయవాడ-హైదరాబాద్ మార్గంలో చౌటుప్పల్ వద్ద వందల సంఖ్యలో కార్లు, ఇతర వాహనాలు బారులు తీరాయి. బతుకమ్మ సంబరాలు, దసరా పండగ, దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో జనం తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు, ప్రయాణికులకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.

సిద్ధిఖీ హత్య కేసు.. ఆ నిందితుడు మైనర్ కాదు

ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య కేసులో నిందితుడైన ధర్మరాజ్ కశ్యప్ మైనర్ కాదని తేలినట్లుగా పోలీసులు పేర్కొన్నారు.

ముంబయి,అక్టోబర్ 14 (రిపబ్లిక్ న్యూస్): ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీ హత్య కేసులో నిందితుడైన ధర్మరాజ్ కశ్యప్ మైనర్ కాదని తేలింది. హత్య కేసులో నిందితులైన హరియాణాకు చెందిన కర్నైల్ సింగ్, ఉత్తరప్రదేశ్కు చెందిన ధర్మరాజ్ కశ్యప్, యూపీకి చెందిన శివకుమార్ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే న్యాయస్థానంలో ఈ కేసు విచారణ జరుగుతున్న సమయంలో నిందితుల్లో ఒకరైన ధర్మరాజ్ కశ్య తాను మైనర్ నని ముంబయి కోర్టుకు తెలిపాడు. నిందితుడి వద్ద సరైన జనన ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో అతడు చెప్పేది నిజమో, కాదో తెలుసుకోవడానికి బోన్ అసిఫికేషన్టెస్టు చేయాలని న్యాయస్థానం పోలీసులకు సూచించింది.తాజాగా ఆ టెస్టు రిపోర్టుల్లో అతడు మైనర్ కాదని తేలడంతో నిందితుడిని పోలీస్ కస్టడీకి తరలించారు. నిందితులకు అక్టోబర్ 21 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తున్నట్లుగా కోర్టు పేర్కొంది. కాగా ఈ హత్య కేసు నిందితులకు ఆశ్రయం ఇచ్చిన పుణెకు చెందిన ప్రవీణ్ లోకర్ అ వ్యక్తిని అరెస్టు చేసినట్లుగా ముంబయి క్రైం బ్రాంచ్ పోలీసులు వెల్లడించారు. ఈ హత్యకు బిష్ణోయ్ గ్యాంగ్నే కారణమని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన షుబు లోకర్కు ఇతడు సోదరుడని తెలిపారు. కాగా షుబు లోకర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.బాబా సిద్ధిఖీ శనివారం సాయంత్రం ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. పలువురు దుండగులు అతడి పై కాల్పులకు పాల్పడ్డారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. సిద్ధిఖీకి ముంబయి బాంబు పేలుళ్ల సూత్రధారి, భారత మోస్ట్వాంటెడ్ దావూద్ ఇబ్రహీంతో సంబంధాలు ఉండటం, తమ టార్గెట్ అయిన బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్కు అతడు స్నేహితుడు అవడం వంటి కారణాల వల్లే అతడిని హత్య చేశామని పేర్కొంది. అయితే ఈ లింక్పై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1970 : ప్రపంచ ప్రమాణాల దినోత్సవం.
- 1956 : నాగపూరులో అంబేద్కర్ రెండు లక్షల మంది అనుచరులతో సహా బౌద్ధవ-ంతం స్వీకరించాడు.
- 1969 : సినిమా రచయిత, చిత్ర దర్శకుడు, నటుడు, డిస్ట్రిబ్యూటర్, షోమాన్, ఛాయాగ్రహకుడు అర్దేషీర్ ఇరానీ మరణం (జ.1886).
- 1981 : హోస్నీ ముబారక్ 2011 వరకు ఈజిప్టుకు నాల్గవ అధ్యక్షుడిగా పనిచేశాడు.
- 1981 : ప్రముఖ భారత క్రికెట్ క్రీడాకారుడు గౌతమ్ గంభీర్ జననం.
- 1985 : అస్సాం గణ పరిషత్ స్థాపించబడింది.
- 1994 : బొగద సొరంగానికి నిర్మాణపు పనులు మొదలుపెట్టారు.
- 1998 : అమర్త్యసేన్ కు ఆర్థికశాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. (చిత్రంలో)

ప్రపంచ ప్రమాణాల దినోత్సవం.

అంబేద్కర్

షోమాన్,

హోస్నీ

గౌతమ్ గంభీర్

అస్సాం గణ పరిషత్

బొగద సొరంగా

అమర్త్యసేన్

కంగువా'లో ఏఐతో డబ్బింగ్.. ఆసక్తికర విషయం పంచుకున్న నిర్మాత

10 భాషల్లో ప్రేక్షకుల ముందుకురానున్న సూర్య 'కంగువా' గురించి నిర్మాత ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఏఐ సాయంతో దీని డబ్బింగ్ పనులు పూర్తిచేయనున్నట్లు చెప్పారు.

సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కంగువా' శివ దర్శకత్వంలో ఇది రూపొందుతుంది. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్ గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా గురించి నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా నెటిజన్లతో ముచ్చటించిన ఆయన 'కంగువా'లో ఏఐని ఉపయోగించినట్లు చెప్పారు.'కంగువా'ను ఏకంగా 8 భాషల్లో ఒకేసారి రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన నిర్మాత ఓ విషయం పంచుకున్నారు. "తమిళ వెర్షన్ను సూర్య డబ్బింగ్ చెప్పగా.. మిగతా భాషల్లో ఏఐ సాయంతో డబ్బింగ్ పనులు పూర్తిచేయనున్నాం. డబ్బింగ్ పనుల కోసం కోలీవుడ్లో ఏఐని ఉపయోగించడం ఇదే తొలిసారి. ఇటీవల విడుదలైన 'వేట్టయన్'లో అమితాబ్బచ్చన్ వాయిస్ లో మార్పుల కోసం ఏఐను ఉపయోగించారు. ఇప్పుడు పూర్తిగా డబ్బింగ్ కోసం మేం దీన్ని ప్రయోగిస్తున్నాం. ఇది విజయవంతమవుతుందని భావిస్తున్నాం. ఈ చిత్రం అన్ని ప్రధాన భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్లలో విడుదల కానుంది. చైనీస్, జపనీస్ విడుదల తేదీలను కూడా త్వరలోనే ప్రకటిస్తాం" అని నిర్మాత జ్ఞానవేల్ చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.1000 కోట్ల కలెక్షన్స్ చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్మాత ఇటీవల చెప్పారు. పార్ట్ 2, పార్ట్ 3 కథలు సిద్ధంగా ఉన్నాయని.. పార్ట్ 1 విజయం ఆధారంగా వాటిని తెరకెక్కించేలా ప్లాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. యాక్షన్తోపాటు ఎమోషన్స్కు ఇందులో అధిక ప్రాధాన్యం ఉందన్నారు. త్రీడీలోనూ అలరించనున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కంగ అనే ఓ పరాక్రముడి కథతో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దిశా పఠానీ కథానాయిక. బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. జగపతి బాబు, యోగిబాబు, కోవై సరళ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఆ సినిమాలో నన్ను తొలగించి కాజల్ను తీసుకున్నారు: రకుల్ ప్రీత్ సింగ్

తనతో ఓ షెడ్యూల్ పూర్తి చేశాక సినిమా నుంచి తొలగించారని రకుల్ అన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా తన స్థానంలో కాజలు తీసుకున్నారని వెల్లడించారు.

ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్. తన కెరీర్ ప్రారంభంలో ఎన్నో అవకాశాలు కోల్పోయానని చెప్పిన రకుల్.. గతంలో ప్రభాస్ సినిమా నుంచి తనను తొలగించడం గురించి మరోసారి మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభాస్ సినిమాలో తన స్థానంలో కాజల్ను తీసుకున్నట్లు వెల్లడించారు."ప్రభాస్ సరసన ఓ సినిమాలో నాకు అవకాశం వచ్చింది. ఒక షెడ్యూల్ను కూడా చిత్రీకరించారు. అప్పుడు నేను దిల్లీలో చదువుకుంటున్నా. దీంతో షెడ్యూల్ పూర్తి కాగానే తిరిగి దిల్లీ వెళ్లిపోయా. అక్కడికి వెళ్లాక రెండో షెడ్యూల్ కోసం ఎన్నిరోజులైనా ఫోన్ రాలేదు. నా స్థానంలో కాజల్ను తీసుకున్నట్లు తర్వాత తెలిసింది. నాకు కనీస సమాచారం ఇవ్వకుండా ఆ సినిమా నుంచి తొలగించేశారు. అప్పటికే ప్రభాస్- కాజల్ కాంబినేషన్లో ఓ సినిమా వచ్చి మంచి విజయం సాధించింది. దీంతో మరోసారి ఆ జోడి రిపీట్ అయితే బాగుంటుందని భావించిన చిత్రబృందం నన్ను తొలగించి తనను తీసుకుంది. సినిమా అనేది ఓ వ్యాపారం.. ఇందులో కొత్తగా పరిశ్రమకు వచ్చిన అమ్మాయిలకు ఇలా జరగడం సహజమే. నాకు ఎన్నోసార్లు ఇలా జరిగింది. ఒక అవకాశం పోయినా.. దానికి మించింది మన కోసం ఎదురుచూస్తుంటుందని నేను భావిస్తా" అని రకుల్ చెప్పారు.గతంలోనూ రకుల్ నెపోటిజం కారణంగా తనకు అవకాశాలు రాలేదని వెల్లడించారు. "సినిమాఛాన్స్ను కోల్పోవడం జీవితంలో ఓ భాగం. నాకు దక్కని వాటి గురించి ఆలోచించి సమయంవృథా చేసుకోను. ఏం చేస్తే నేను వ్యక్తిగతంగా ఎదుగుతానో దానిపై శ్రద్ధ పెడతాను. ఒక స్టార్కిడ్కు లభించినంత సులభంగా మిగతా వారికి ఛాన్సు రావు. అదంతా వారి తల్లిదండ్రుల కష్టం"అని రకుల్ వివరించారు. ప్రస్తుతం అజయ్దేవగణ్ జంటగా రకుల్ ప్రీత్ సింగ్ 'దే దే ప్యార్ దే2'లో నటిస్తున్నారు. విజయవంతమైన 'దే దే ప్యార్ దే'కి కొనసాగింపుగా అన్షుల్ శర్మ దీన్నితెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఇది విడుదల కానుంది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

ఎల్బీ నిర్ణయంపై వివాదం.. భారత్ ఓటమికి ఇదొక కారణమా?

చివరి ఓవర్ మినహా భారత్ విజయం కోసం తీవ్రంగా కష్టపడింది. కానీ, ఆసీస్ బౌలర్లు నియంత్రణతో బౌలింగ్ చేయడంతో టీ20 ప్రపంచ కప్ కీలక పోరులో టీమ్ ఇండియాకు ఓటమి తప్పలేదు.

టీమ్ ఇండియా రెండో ఓటమిని చవిచూసింది. దీంతో సెమీస్ అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. ఆస్ట్రేలియాతో జరిగిన కీలకమైన లీగ్ మ్యాచ్లో 9 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ మ్యాచ్లో ఎల్బీపై థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు వివాదాస్పదమైంది. టీమిండియా ఓటమికి ఇదొక కారణమని అభిమానులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించారు. ఇంతకీ అసలేం జరిగిందంటే?ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ లో 17వ ఓవర్ను భారత బౌలర్ దీప్తి శర్మ వేసింది. రెండో బంతిని ఎదుర్కొన్న ఆసీస్ ప్లేయర్ లిచ్ఫీల్డ్ బ్యాటింగ్ చేస్తోంది. ఆమె స్వతహాగా ఎడమచేతివాటం బ్యాటర్. దీప్తి శర్మ ఆఫ్ వికెట్ వైపుగా బంతిని విసిరింది. కానీ, స్విచ్ షాట్ కొట్టేందుకు లిచ్ఫీల్డ్ బ్యాటింగ్ శైలిని రివర్స్ చేసింది. బంతిని కొట్టడంలో విఫలం కావడంతో బౌలర్ తోపాటు భారత ఫీల్డర్లు ఎల్బీ కోసం అప్పీలు చేశారు. ఫీల్డ్ అంపైర్ ఔట్గా ప్రకటించారు. ఈ నిర్ణయంపై లిచ్ఫీల్డ్ డీఆర్ఎస్ తీసుకుంది. సమీక్షలో మాత్రం బంతి అవుట్సైడ్ లెగ్ అని చూపించడంతో థర్డ్ అంపైర్ నాటౌట్గా తేల్చి నిర్ణయం వెల్లడించారు. ఆ సమయంలో లిచ్ఫీల్డ్ కేవలం 5 పరుగుల వద్దే ఉంది. బ్యాటర్ బంతి పడకముందే ఎడమ చేతివాటం నుంచి కుడికి మారినప్పుడు 'అవుట్సైడ్ లెగ్' అనేందుకు అవకాశమే లేదనేది క్రికెట్ విశ్లేషకుల వాదన. థర్డ్ అంపైర్ నిర్ణయంతో భారత క్రికెటర్లు స్మృతీ మంధాన, షఫాలీ వర్మ, దీప్తి శర్మ తీవ్ర నిరాశ చెందారు. ఇన్నింగ్స్ చివరి వరకూ ఆడిన లిచ్ఫీల్డ్ 9 బంతుల్లో 15 పరుగులు చేసింది. 20వ ఓవర్ ఆఖరి బంతికి సిక్స్ బాదడం గమనార్హ

ఆరోగ్యం

మన ఆరోగ్యాన్ని పెంచే కొన్ని ఫుడ్స్ ఉంటాయి. వీటిని రెగ్యులర్గా తినడం చాలా మంచిది. అయితే, మంచి ఫుడ్స్ అన్ని తినడం మంచిదే. కానీ, వాటిని ఎలా తింటున్నామనేది తెలుసుకోవడం ముఖ్యం. వివరంగా చెప్పాలంటే రెండు హెల్దీ ఫుడ్స్ని కంబైండ్ చేసి తినడం చేస్తుంటారు. కానీ, అవి అంత హెల్దీ కాకపోవచ్చు. వాటిని కలిసినప్పుడు కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. అందులో పెరుగుతో కలిపి తినకూడని కొన్ని ఫుడ్స్ ఉన్నాయి. పెరుగు హెల్దీనే... కూరగాయలు కూడా ఆరోగ్యకరమే. కానీ, ఈ రెండింటిని కలిపినప్పుడే అవి బ్యాడ్ కాంబినేషన్గా ఉంటాయి. అలాంటి కూరగాయలు ఏంటో తెలుసుకోండి.

పెరుగుతో వీటిని కలిపి అస్సలే తినకూడదు.. మీకే మంచిది కాదు

వెల్లుల్లి..

వెల్లుల్లిలో కూడా వేడి చేసే గుణం ఉంటుంది. పెరుగు, వెల్లుల్లి కలిసినప్పుడు కొంతమందికి కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి.

ఉల్లిపాయ..

ఎరుగులో ఉల్లిపాయ కలిపి తింటే పేగు నొప్పి వస్తుంది. ఎందుకంటే ఉల్లిపాయ త్వరగా జీర్ణమవ్వదు. దీంతో కడుపులో సమస్యగా ఉంటుంది. మీకు ఆల్రెడీ జీర్ణ సమస్యలు ఉంటే ఈ కాంబినేషన్ని అవాయిడ్ చేయడం మంచిది.

ముల్లంగి..

ముల్లంగిలో వేడి స్వభావం ఉంటుంది. దీనిని పెరుగుతో కలిపి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ దెబ్బతింటుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యల్ని కలిగిస్తాయి. కాబట్టి, ఈ కాంబినేషన్ కూడా అంత మంచిది కాదు.

దోసకాయ..

చాలా మంది సలాడ్లో పెరుగు, దోస వేసుకుని తింటారు. కానీ, అస్సలు ఇది అస్సలు మంచి కాంబినేషన్ కాదు. దోసకాయలో 70 శాతం నీరు ఉంటుంది. దోసకాయని పెరుగుతో కలిపి తింటే జీర్ణాశయంలో సమస్యల్ని తీసుకొస్తుంది. కాబట్టి, పెరుగుతో దోసకాయ తినకపోవడమే మంచిది

టమాట...

టమాట.. మనం ప్రతిరోజూ వాడే కూరగాయల్లో టమాటలు ఒకటి. ఓ రకంగా చెప్పాలంటే టమాటలు లేని కూరలు కొంతమంది చేయ-రు. పప్పులో అయినా టమాటలు పడాల్సిందే. ఇది రెగ్యులర్గా వాడే వెజిటేబుల్. టమాటలు సహజంగానే ఆమ్ల గుణంతో నిండి ఉంటాయి. దీనిని పెరుగుతో కలిపి తిన్నప్పుడు అజీర్ణం, అసిడిటీ సమస్యలు వస్తాయి. పెరుగులో కూడా ఆమ్ల గుణాలు ఉంటాయి. ఈ రెండు కలిసినప్పుడు అజీర్ణం, అసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి, వీటిని కలిపి ఎప్పుడు తినొద్దు.

పాలకూర..

ఆకుకూరలు నిజానికీ ఆరోగ్యానికి చాలా మంచివి. పాలకూరలో ఆక్సాలిక్ యాసిడ్ ఉంటుంది. కాల్షియం శోషణకి ఆటంకం కలిగిస్తుంది. దీని వల్ల కడుపునొప్పి వస్తుంది.

గమనిక : ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.